క్లుప్తంగా

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

పెదపూడి: మండలంలోని సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన అలివేలు మంగ సమేత కలియుగ వేంకటేశ్వర స్వామి వారికి శనివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి తులసి, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భక్తులతో గోవిందనామాలు ఆచరింపజేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


అనపర్తిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పెదపూడి: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. అనపర్తిలోని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత దంత, కంటి, మధుమేహ వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన రమా డెంటల్, మోహన్ మధుమేహ ఆస్పత్రి, అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యులు సుమారు 320 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధి పీవీఎన్ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వృత్తి విద్యపై శిక్షణ


విద్యార్థులకు టైలరింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ట్రైనర్

పెదపూడి: విద్యార్థులు విద్యతో పాటు వృత్తి విద్యలో శిక్షణ పొందడంతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వృత్తి విద్య టెక్నికల్ ట్రైనర్లు ఆసాద్, పవన్‌రెడ్డి అన్నారు. శనివారం జి.మామిడాడ గ్రామంలోని పీఎంశ్రీ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో విద్యార్థులకు వృత్తి విద్యపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9, 10, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్య కోర్సులు అవసరమని దాని ప్రాముఖ్యతను వివరించారు. అలాగే టైలరింగ్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోరాడ శ్రీనివాస్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, తిర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సభలతో భూ సమస్యల పరిష్కారం

మధురపూడి: రెవెన్యూ సభల ద్వారా గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరుకొండ తహసీల్దార్ వాకపల్లి సుస్వాగతం కోరారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన సభలు ప్రారంభమయ్యాయన్నారు. సోమ, మంగళవారాల్లో బుచ్చెంపేట, 22, 23న బొల్లెద్దుపాలెం, 24న జంబూపట్నం, 25వ తేదీ ఉదయం పశ్చిమగానుగూడెం, 25, 26 తేదీల్లో రాఘవపురం, 28, 29 తేదీల్లో కోటికేశవరం, 29 మధ్యాహ్నం, 30 తేదీల్లో గాడాల, నవంబరు 4న నిడిగట్ల, 5న మధ్యాహ్నం, 6వ తేదీల్లో కాపవరం, 7, 8న మునగాల, 11, 12న మధురపూడి, 13, 14న గాదరాడ, 15, 16న నర్సాపురం, 18,19న కణుపూరు, 20న బూరుగుపూడి, 21న గుమ్ములూరులో సభలు జరుగుతాయన్నారు.

నేడు పల్లె పండుగ కార్యక్రమాలు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి, పందలపాక, ఊలపల్లి, బిక్కవోలు, ఇలపల్లి, రంగాపురం, బలభద్రపురం, కాపవరం గ్రామాల్లో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రత్నకుమార్ తెలిపారు.

కోరుకొండ మండల అధికారులు

ఎంపీడీఓ	బత్తిన అశోక్ కుమార్	94413 83567
తహసీల్దార్	సుస్వాగతం	80088 03195
వ్యవసాయశాఖ ఏడీ	మల్లికార్జునరావు	83310 56576
సీఐ	సత్య కిషోర్	94409 04829
ఎస్సై	శ్యామ్ సుందర్	94409 04831
ఎక్సైజ్ సీఐ	శ్రీనివాస బాలాజీ	98484 42997

వరిపై ఎలుకల దాడి

- ఉద్యాన పంటలకూ నష్టం
- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో అన్నదాతలు
- సామూహిక చర్యలు చేపట్టాలంటున్న వ్యవసాయాధికారులు


రాపాక వద్ద ఏపుగా పెరిగిన వరి పంట


వరి దుబ్బును కొరికేస్తున్న ఎలుక

సీతానగరం: వరితో పాటు ఉద్యాన పంటలను ఎలుకల బెడద వెంటాడుతోంది. ముఖ్యంగా వరిని మూషికాలు నాశనం చేస్తున్నాయి. అందిన కాడికి కంకులను కొరికేస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ఆకుమడి దశ నుంచి కుప్పల వరకూ వీటితో ఇబ్బందులు తప్పడం లేదు. రబీలో సాగుచేసే మొక్కజొన్న, అపరాల పంటలు కూడా తప్పించుకోలేకపోతున్నాయి. పంట వేసినప్పటి నుంచీ ఇంటికి పంట వచ్చే వరకు ఎలుకలు దాడి చేస్తూనే ఉంటున్నాయి. వీటిని అరికట్టడానికి రైతులందరూ సామూహికంగా చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

52 వేల ఎకరాలలో సాగు

నియోజకవర్గంలోని 52 వేల ఎకరాలలో వరి, ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. మండలాల వారీగా సీతానగరంలో 11 వేల ఎకరాల్లో వరి, 4 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు, కోరుకొండలో 15 వేల ఎకరాల్లో వరి, రాజానగరంలో 12 వేల ఎకరాల్లో వరి, పది వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. వరి పంట ప్రస్తుతం పలు దశలలో ఉంది. కొంత పంట దుబ్బు చేసి పిలుకలు వేసే దశలోనూ, మోటార్ల వద్ద ముందుగా వేసిన వరి పంట పొట్ట దశ దాటి కంకులు వేసేస్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో ఎలుకల బెడద వేధిస్తోంది. నీటి మట్టానికి 6 సెంటీమీటర్లు మించిన ఎత్తులో వరి పిలకలను కొరికి వేస్తున్నాయి. చిరు దశలో ఎలుకలు కలిగించే నష్టం ఎక్కువగా ఉంటుంది. పొలంలో ఖాళీలు ఏర్పడి ఎండిపోయినట్లు కనిపిస్తుంది. దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది.

గుర్తించే విధానం

ఎలుకలు సంచరించే పొలం గట్లపై బొరియలు ఉంటాయి. పొలంలో కొరికి వేసిన వరి పిలకలు, దుబ్బులు పడి ఉంటాయి. పొలంలోని బురదలో ఎలుకల పాదముద్రలు కనిపిస్తాయి. ఎలుకలు విసర్జించిన పదార్థాల ద్వారా వాటి ఉనికిని గుర్తించవచ్చు

నివారణా చర్యలు

రైతులు తమ పొలం గట్లపై కలుపు, మొక్కలను తొలగించాలి. గట్లను శుభ్రం చేయాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా బ్రొమోడయోలోన్ అనే ఎరను రైతులకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. దానితో రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి. 480 గ్రాముల నూకలు, 10 గ్రాముల బ్రొమోడయోలోన్ మందు, 10 గ్రాముల నూనెలతో 500 గ్రాముల మందు తయారు చేయాలి. ఇది సుమారు 50 ఎలుకల బొరియలకు సరిపోతుంది. మొదటి రోజు ఎలుకల బొరియలు మట్టితో కప్పివేయాలి. రెండో రోజు తెరుచుకున్న బొరియలలో 10 గ్రాముల చొప్పున కట్టిన మందు పొట్లాలను ఒకటి చొప్పున వేయాలి. రైతులందరూ సామూహికంగా తమ పొలాలలో ఎలుకల నిర్మూలన చర్యలు ఒకేసారి చేపట్టాల్సి ఉంటుంది. దీని ద్వారా ఎలుకలను నిర్మూలించవచ్చు

ఎలుకల బెడద



నాలుగు ఎకరాల్లో వరిపంటను సాగు చేస్తున్నాను. దీనిలో రెండు ఎకరాలు వర్షాలకు రెండు సార్లు ముంపులోకి వెళ్లింది. తిరిగి మూడో సారి వరి పంట వేశాను. నాలుగు ఎకరాల పంట ప్రస్తుతం వివిధ దశలలో ఉంది. ఎలుకలు అందిన కాడిని దుబ్బులను కొరికేస్తున్నాయి. వాటి వల్ల దిగుబడి గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది. వ్యవసాయశాఖాధికారులు మందులు ఇస్తున్నా, ఎలుకలు తగ్గడం లేదు. రైతులందరూ ఒకేసారి మందు పెట్టాలి.

– దొక్కా నాగేశ్వరరావు, కౌలురైతు, మిర్తిపాడు

సామూహిక చర్యలు



ఎలుకల నివారణకు రైతులందరూ సామూహికంగా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం అందజేస్తున్న బ్రొమోడయోలిన్ మందును తమ పొలాల్లోని ఎలుకల బొరియల్లో ఒకేసారి పెట్టాలి. ఖరీఫ్ సీజన్‌లో ఎలుకల బెడద ఎక్కువగా ఉంటుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల వారీగా మందును అందిస్తున్నాం. రైతులు తమ పొలాలతో పాటు చుట్టుపక్కల ఉన్న స్థలాల్లోని బొరియల్లో కూడా మందు పెడితే ప్రయోజనం ఉంటుంది.

– కె.సూర్య రమేష్, ఏవో, సీతానగరం

22 నుంచి గ్రామ సభలు

పెదపూడి: భూసమస్యల పరిష్కారానికి నిర్వహించే రీసర్వే గ్రామ సభలు మండలంలో ఈ నెల 22వ తేదీ నుంచి నవంబర్ 16వ తేదీ వరకూ నిర్వహించనున్నామని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు తెలిపారు. ఆయన శనివారం పెదపూడిలో మాట్లాడుతూ ఈ నెల 22న రామేశ్వరం, 23న వేండ్ర, 24న ఏపీత్రయం, 25న చింతపల్లి, 26న దోమాడ, 29న పుట్టకొండ, 30న కరకుదురు, నవంబర్ 1న సంపర, 2న పెదపూడి, 5న కాండ్రేగుల, 6న కుమారప్రియం, 7న శహపురం, 8న కై కవోలు, 12న పైన, 13న పెద్దాడ, 14న రాజుపాలెం, 15న గండ్రేడు, 16న జి.మామిడాడ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. భూకొలతల్లో తేడాలు, సర్వే నంబర్లలో మార్పులు, వారసత్వం పేర్ల నమోదు, సరిహద్దు సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రికార్డుల్లో నమోదైన తప్పులు, భూ ఆక్రమణలు, అసైన్డ్, చుక్కల భూముల అన్యాక్రాంతం తదితర అంశాలపై రైతులు అర్జీలు చేసుకోవచ్చన్నారు. ఈ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గైట్‌లో డిప్లమో కోర్సులు

రాజానగరం: వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం గైట్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో కోర్సులు ప్రారంభించనున్నామని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ గ్రూప్‌లో ఉత్తీర్ణులైన వారు, అలాగే రెండేళ్ల ఐటీఐ పూర్తి చేసిన వారు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. లెటరల్ విద్యార్థుల మాదిరిగానే నేరుగా ద్వితీయ సంవత్సరం పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశిస్తారన్నారు. ఈ నెల 21 నుంచి 26 వరకు అడ్మిషన్లు జరుగుతాయని, ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు నేరుగా ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీ రామానుజాన్ని సంప్రదించాలని, లేకుంటే 88866 60481 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

టెక్నాలజీపై అవగాహన అవసరం


సదస్సులో పాల్గొన్న ఎస్సై రామ్ కుమార్ తదితరులు

సీతానగరం: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ముఖ్యంగా టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై డి.రామ్ కుమార్ అన్నారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై రామ్ కుమార్ మాట్లాడుతూ వివిధ యాప్‌ల ద్వారా నేరగాళ్లు అనేక మార్గాల్లో మోసాలు చేస్తున్నారన్నారు. ఇన్‌స్ట్రాగామ్, ఫేస్‌బుక్‌లలో వ్యక్తిగత చిత్రాలను, వివరాలను పంపవద్దన్నారు. కొత్తకాల్స్‌ను నమ్మి మోసపోవద్దని, తెలియని వారితో చాటింగ్ ప్రమాదకరమన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ను జాగ్రత్తగా వినియోగించాలన్నారు. డబ్బులు సంపాదించవచ్చంటూ కొందరు మోసగాళ్లు లింక్‌లను పంపిస్తున్నారన్నారు. వాటిని నమ్మి క్లిక్ చేస్తే తీవ్రంగా నష్టపోతామని హెచ్చరించారు. సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు

నూతన వంగడాల దిగుబడులు ఆశాజనకం


చంద్రేడులో పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు తదితరులు

రంగంపేట: రైతు కమతాలలో ప్రదర్శన నిమిత్తం వేసిన నూతన వరి వంగడాల దిగుబడులు ఆశాజనకంగా కనిపిస్తున్నాయని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు అన్నారు. మండలంలోని చంద్రేడు, వడిశలేరు, రంగంపేట గ్రామాల్లో పరిశోధన నిమిత్తం రైతు కమతాలలో వేసిన నూతన వరి వంగడాలు బీపీటీ 3082, బీపీటీ 2841(నల్ల బియ్యం), బీపీటీ 2858 (ఎర్ర బియ్యం) రకాల పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు మాట్లాడుతూ బీపీటీ 3082 రకం పంట చేనులో సుడిదోమ లేకపోవడమే కాకుండా కంకి నిండా గింజలతో కనిపిస్తుందన్నారు. నల్లబియ్యం రకమైన బీపీటీ 2841 పంట కొత్త ప్రయోగంలో ఎకరాకు సార్వాలో 36 బస్తాల (75 కిలోలు) దిగుబడిని ఇచ్చిందన్నారు. వ్యవసాయ విద్యార్థులు స్థానిక అభ్యుదయ రైతు పోతల పద్మారావు వ్యవసాయ క్షేత్రంలో బీపీటీ 5204 రకంలో మాని పండు తెగులును, మినుములో చిత్ర పురుగు, పల్లాకు తెగులు గుర్తించి రైతులకు నివారణ చర్యలు సూచించారు. అనంతరం రంగంపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, వ్యవసాయ విద్యార్థినులు సాయి శ్యామల, నాగమణి, చరిష్మా, ఎర్రయమ్మ, సునీత, మండల వ్యవసాయ అధికారి కె.శ్రీనివాస్, వీఏఏ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే పనులు గుర్తించాలి


కుమారప్రియంలో మాట్లాడుతున్న ఏపీఓ సత్యనారాయణ

పెదపూడి: నిబంధనల ప్రకారమే ఉపాధి హామీ పథకం పనులను గుర్తించాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ సత్యనారాయణ అన్నారు. కుమారప్రియం గ్రామంలో సర్పంచ్ బిరదా వీరవెంకట సత్యనారాయణ అధ్యక్షతన ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు గ్రామ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ 2025–2026 సంవత్సరానికి సంబంధించి గ్రామంలో సుమారు 89 పనులు గుర్తించారన్నారు. స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామంలో గుర్తించిన పనులను ప్రజలకు చదివి వినిపించారు. దానికి గ్రామ సభ ఆమోదం తెలిపింది. అలాగే గోతులతో పాడైన పుంత రోడ్లను ఉపాధి హామీ పథకంలో బాగు చేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి ఎస్.వీరాస్వామి నాయుడు, చోడిశెట్టి ఫణీంద్ర, బిరదా కృష్ణ, ఎలుగుబంట్ల చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సొసైటీ సమావేశం


సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

రాజానగరం: మండలంలోని నందరాడ వ్యవసాయ సహకార పరపతి సంఘ (సొసైటీ) సర్వసభ్య సమావేశం ఎట్టకేలకు జరిగింది. కోరం లేదని గత నెలలో వాయిదా పడిన సమావేశం ఈసారి అంతంత మాత్రంగానే హాజరైన సభ్యులతో మమ అనిపించేశారనే విమర్శల నడుమ ప్రత్యేకాధికారి లేకుండానే జరిగిపోయింది. క్రాప్ రుణాలకు సంబంధించిన వడ్డీని గత ఏడాది సకాలంలో చెల్లించినప్పటికీ రుణాలను రెన్యువల్ చేయలేదని, షేర్ క్యాపిటల్‌పై సభ్యులకు డివిడెండ్లు పంచాలని, సత్వరమే కొత్త భవనాన్ని నిర్మించాలని, రూ.10 కోట్ల ఓవర్ డ్యూతో సొసైటీని నడపడానికి, నష్టాలకు గల కారణాలను సభ్యులు మైరెడ్డి గంగాధర్, అడబాల గణపతిరావు, తదితరులు ప్రశ్నించారు. సమావేశంలో మాజీ అధ్యక్షుడు అడుసుమిల్లి ఉదయ్, ఆళ్ల శివనాగరాజు, ఉల్లి శివ, గోలి రాజు, ఎ.బాబు, కర్రి సత్యనారాయణ, ప్రగడ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండలో ట్రాఫిక్ వెతలు


లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం రోడ్డులో ట్రాఫిక్ రద్దీ

- వాహనాల రద్దీతో అవస్థలు
- తరచూ ట్రాఫిక్ జామ్

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండ ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ట్రాఫిక్‌లో చిక్కుకుంటే బయటకు రావడం గగనమవుతోంది. పగటి సమయంలో కూరగాయల మార్కెట్, రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద, సాయంత్రం పూట గోకవరం వైపునకు వెళ్లే జాతీయ రహదారిలో వాహనాలు బారులు తీరుతున్నాయి. వాహనాల రద్దీ అధికమవ్వడంతో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ఆ దారిలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మండల కేంద్రమైన కోరుకొండకు వివిధ పనులపై చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు తరలివస్తారు. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకోవడానికి అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు విచ్చేస్తారు. ట్రాఫిక్ నేపథ్యంలో వీరందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల రద్దీతో పాటు ఉన్న రహదారి ఇరుకుగా మారడం కూడా సమస్యకు మరో కారణం. బస్టాండ్ సెంటర్‌లోని కూరగాయల దుకాణాల వ్యాపారులకు మార్కెట్ స్థలాన్ని కేటాయించి అక్కడికి మార్చడం, అలాగే రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వేరే ఖాళీ ప్రదేశానికి తరలించడం, స్వామివారి దేవస్థానానికి వెళ్లే రోడ్డును వెడల్పు చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యను అధిగమించవచ్చని పలువురు సూచిస్తున్నారు.

దాతల సాయం కోసం ఎదురుచూపులు

- నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న లారీ డ్రైవర్
- వైద్యానికి డబ్బులు లేక మంచానికే పరిమితం


నోటి క్యాన్సర్‌తో బాధపడుతూ మంచానికే పరిమితమైన అంజనీ కుమార్‌రాజు

రంగంపేట: మండలంలోని ఈలకొలను గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ఇనుపగుర్తిక అంజని కుమార్ రాజు నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన రాజు పనిచేస్తే తప్ప ఇల్లు గడవని పరిస్థితి వారిది. ఆయన మంచానికే పరిమితం కావడంతో రాజు కుటుంబ సభ్యులంతా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు రాజు వైద్యం కోసం దొరికనచోటల్లా అప్పులు చేసి ఇప్పటికే రూ.3 లక్షల వరకూ ఖర్చు చేశారు. మరో 40 రోజుల పాటు వైద్యం చేస్తే తప్ప రాజు కోలుకోవడం కష్టమని, దానికి భారీగా ఖర్చవుతుందని వైద్యులు తేల్చి చెప్పారని రాజు భార్య దుర్గాలక్ష్మి చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నామని, 98489 75124 ఫోన్ నెంబరులో సంప్రదించి సాయం అందించాలని కోరుతున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వినతిపత్రం అందించామని తెలిపారు. జిల్లా భట్రాజుల సంఘం సభ్యులమంతా కలిసి రూ.25 వేలు ఆర్థిక సాయం చేశామని సంఘం జిల్లా అధ్యక్షుడు లోలభట్టు శ్రీనివాసరాజు తెలిపారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలి


అనపర్తిలో వర్తకులతో సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుమంత్

పెదపూడి: అనపర్తి మెయిన్‌రోడ్డులో వ్యాపారులు ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ అన్నారు. శనివారం అనపర్తిలో స్థానిక వర్తక సంఘం కార్యాలయంలో వర్తక, చిరు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుమంత్ మాట్లాడుతూ మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన తోపుడు బళ్లను రెండు రోజుల్లో తీసివేయాలని హెచ్చరించారు. మెయిన్ రోడ్డు మధ్యలో ఏర్పాటు చేస్తున్న తోపుడు బళ్ల వల్ల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదరవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను నాయక్, వర్తక సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజానగరం: ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూపరమైన సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం నిర్వహించిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించి, సంబంధిత అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

లాలాచెరువు హెచ్‌బీ కాలనీలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు. కాలనీలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రారంభోత్సవం చేశారు. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అట్లతద్దె


కొంకుదురులో ఊయల ఊగుతున్న విద్యార్థులు

బిక్కవోలు: ఆడపడుచులంతా అట్ల తద్దె పండగను శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహలతో జరుపుకున్నారు. స్త్రీలు సౌభాగ్యం కోసం చేసే ఈ వ్రతాన్ని మహిళలు అత్యంత కీలకమైనదిగా భావించి పూజలు చేశారు. తెల్లవారుజామునే లేచి ఆహారం తిన్న అనంతరం రోజంతా కఠిక ఉపవాసం చేసి గౌరీదేవిని పూజించారు. ముత్తైదువులకు తాంబూలాలు, వాయనాలు సమర్పించారు. ఊయల ఊగుతూ, పాటలు పాడుతూ పల్లె ప్రాంతాల్లో యువతులు, వివాహితులు సందడి చేశారు. పంట కాలువల వద్ద, గోదావరి నదీతీరంలో సంప్రదాయ పద్ధతిలో నీళ్లగౌరమ్మకు పూజలు జరిపారు. అలాగే గోవు చుట్టూ ప్రదక్షిణలు చేసి గోపూజలో పాల్గొన్నారు. ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు.

దుప్పట్లు, పండ్ల పంపిణీ

మధురపూడి: కోరుకొండలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మండపంలో శనివారం రాత్రి వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్ కుమారుడు అభిరామ్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఈ వితరణ చేశారు.